

అలిపిరి ఆర్చిపై ఉన్నవి 'గంధర్వుల శిల్పాలు' : టిటిడి

ప్రజాశక్తి - తిరుమల

అలిపిరి లోని ఆర్చ్‌పై అన్యమత బొమ్మలు ఉన్నట్లు అసత్య వార్తలు మీడియా లో రావడం బాధాకరమని, వాస్తవానికి ఆర్చిపైన ఉన్నవి గంధర్వులు పుష్పమాలతో ఉన్న శిల్పాలు అని టిటిడి ఓ ప్రకటనలో తెలిపింది. తిరుపతి అలిపిరిలోని టోల్‌గేట్ ఆర్చ్‌పై "అన్యమత బొమ్మలు" ఉన్నాయని కొన్ని మీడియా సంస్థలు ప్రచారం చేయడం శోచనీయం. ఈ టోల్‌గేట్‌ను ఏళ్ల క్రితమే టీటీడీ నిర్మించింది. ఈ ఆర్చ్‌ను, సనాతన హైందవ ధర్మాన్ని ప్రతిబింబించే శిల్పాల రూపంలో, ఎస్వీ శిల్పకళాశాల నిపుణుల సూచనలతో తీర్చిదిద్దారు. అసత్య కథనాలను ప్రచురించినా లేదా ప్రసారం చేసినా సదరు వ్యక్తులు, సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ హెచ్చరిస్తోంది.

రైతన్నకు కూటమి 'తాలి' సాయం

'పిఎం కిసాన్..అన్నదాత సుఖీభవ' ప్రారంభం / అన్నదాతల ఖాతాలో చెక్కులు జమ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

' రైతన్నల నిజమైన పక్షపాతి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు' అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కొనియాడారు. స్థానిక ఏపీ సీడ్స్ కార్యాలయం వద్ద జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి ఎమ్మెల్యే బొజ్జల శనివారం 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ పథకాన్ని' ప్రారంభించారు. నియోజవర్గ వ్యాప్తంగా 22 వేల మంది రైతుల ఖాతాల్లో 19.27 కోట్ల నగదును జమ చేశారు. రాష్ట్రంపై పదకొండు లక్షల కోట్లు అప్పుల భారం ఉన్నా, చంద్రబాబు అన్నదాత సుఖీభవ అన్నారని తెలిపారు. జగన్ పాలనలో రైతుల ఆత్మహత్యలు తప్ప ఒరిగిందేమీ లేదని విమర్శించారు. వ్యవసాయంలో రైతులకు ఉపయోగపడే విధంగా డ్రోన్లను సబ్సిడీపై అందించడం జరుగుతుందన్నారు. ప్రతి మండలంలో స్టోరేజ్ గోడౌన్ కట్టి రైతులు పంట ఉత్పత్తులు నిల్వ

శ్రీకాళహస్తిలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎంఎల్ఎ బొజ్జల

చేసుకుని ఎక్కువ ధరకు అమ్ముకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆయిల్ ఫామ్ పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపాలని కోరారు.

- యర్రావారిపాలెంలో ... మండలంలో 4,944 మంది రైతులకు రూ.3.43 కోట్లను తహశీల్దార్ పరమేశ్వరస్వామి జమ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మూడుసార్లుగా మొత్తం 20వేలు రైతుల ఖాతాలో జమ చేస్తుందన్నారు.

- గూడూరు టౌన్‌లో... ఎంఎల్ఎ పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టరేట్ ఆవరణలో సభ జరిపారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా పాల్గొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించారు. రెండో విడత అక్టోబర్‌లో, మూడో విడత జనవరిలో జమ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు డివిజన్ వ్యవసాయాధికారి గోపినాయక్, మండల అధికారి రమేష్ పాల్గొన్నారు.

- రామచంద్రాపురం (పాకాల)లో.. పాకాల మండలంలో 5029 మంది రైతులకు రూ.3.52 కోట్లు అందించారు. పాకాల మండలం కె.వడ్డపల్లి పంచాయతీ సచివాలయం వద్ద జేసీ శుభం బన్సల్, జడ్‌పిటిసి నంగ పద్మజాబాబురెడ్డి, టిడిపి నేత బొల్లినేని మహేష్‌కుమార్ పాల్గొన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో దాదాపు 26,062 మంది రైతులకు 17.8578 కోట్ల రూపాయల లబ్ది చేకూర్చిందని తెలిపారు.

హాస్టల్లో జడ్జి తనిఖీలు

హాస్టల్లో, ఆస్పత్రిలో జడ్జి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - వెంకటగిరి

వెంకటగిరి బీసీ బాలుర రెసిడెన్షియల్, ప్రభుత్వ ఆస్పత్రిని జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. మహాత్మాజ్యోతిరావు పూలే రెసిడెన్షియల్‌లో వంటసామగ్రి, స్టాకు, సరుకుల వివరాలు, పరిసరాలు తనిఖీ చేశారు. వంటశాలలో ముడిసరుకు నాశిరకంగా ఉన్నట్లు గుర్తించి శాంపిల్స్ తీసుకున్నారు. చెడిపోయిన కూరగాయలు, వాడిపోయిరన క్యారెట్, లోకల్ పామాయిల్ పరిశీలించారు. పరిశుభ్రంగా లేకపోవడంతో అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు పాండురంగయ్యకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సూదులు ఒకరికి వేసిన సూది మరొకరికి వేస్తున్నారని, కాలం చెల్లిన మందులు పంపిణీ జరుగుతుందని ఫిర్యాదు అందడంతో ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బంది కొరత ఉందని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల లీగల్ అడ్వైజర్ కమిటీ మెంబర్ రాజేష్, రాజారాం, కిషోర్ పాల్గొన్నారు.

బోధనేతర పనులు రద్దు చేయాలి : ఫ్యాప్టో

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దు చేయాలని, 19 డిమాండ్లతో ఫ్యాప్టో నేతృత్వంలో తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద శనివారం ధర్నా జరిగింది. ఫ్యాప్టో ఛైర్మన్ ఎస్.సురేష్ అధ్యక్షత వహించారు. సెక్రటరీ జనరల్ పరిశీలకులుగా వ్యవహరించారు. మాజీ ఎంఎల్‌సి కత్తి నరసింహారెడ్డి, ఛైర్మన్ సురేష్ మాట్లాడుతూ ప్రధానంగా బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలని, ఏకీకృత సర్వీసులు అమలు చేయాలని, ఎంఇఒ పోస్టుల నియామకానికి జీవో నంబర్ 73 ప్రకారం ఉమ్మడి సర్వీసులను పరిగణనలోకి తీసుకోవాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని, 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలు ప్రకటించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సరెండర్ లీవు బకాయిలను విడుదల చేయాలని, 2003 డిఎస్‌సి వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, నిరుపయోగంగా ఉన్న హెల్త్ స్కీమ్‌ను అప్డేట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ వెంకట్రావు, తిరుపతి జిల్లా ఫ్యాప్టో కమిటీ సభ్యులు వేణుగోపాల్, రామచంద్రయ్య, మురళీకష్ణ, బాలసుబ్రమణ్యం, జగన్నాథం, లక్ష్మయ్య, మాజీ ఫ్యాప్టో ఛైర్మన్ ముత్యాలరెడ్డి, ఎంఈఓ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాబ్జి, లక్ష్మీపతి, పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన

దేశంలోనే విశిష్ట నమూనాగా ఐఐఐటీ-శ్రీసిటీ

స్నాతకోత్సవంలో డాక్టర్ జి.సతీష్‌రెడ్డి
318 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

పారిశ్రామికకేంద్రం నడుమ ఐఐఐటీ-శ్రీసిటీ వంటి జాతీయ విద్యాసంస్థ ఏర్పాటు కావడం, దేశంలోనే ఓ విశిష్ట నమూనాగా డీఆర్‌డీఓ మాజీ ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గౌరవ సలహాదారు డాక్టర్ జి.సతీష్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఐఐఐటీ-శ్రీసిటీ 2025 (9 వ బ్యాచ్) స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. మొత్తం 318 మంది విద్యార్థులకు ఐఐఐటీ-శ్రీసిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వి.కార్తికేయన్ పట్టాలను ప్రదానం చేశారు. డాక్టర్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ఐఐఐటి-శ్రీసిటీ కోయంబత్తూరులో టెక్స్‌టైల్ క్లస్టర్ లాంటి పర్యావరణ వ్యవస్థను కలిగి ఉందని, ఇక్కడ విద్యాసంస్థ, పరిశ్రమ కలిపి అభివృద్ధి చెందుతున్నాయన్నారు. వికసిత్ భారత్‌ను నిర్మించడంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఐఐఐటి-శ్రీసిటీ ఛైర్‌పర్సన్, జోహో కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు, సిఇఒ శ్రీధర్ వెంబు వర్చువల్ ప్రసంగం చేశారు. ప్రొఫెసర్ కార్తికేయన్ వార్షిక నివేదికను సమర్పించారు. 18.9 లక్షల వార్షిక వేతనంతో 94 శాతం విద్యార్థులకు ఉద్యోగాల సాధన వంటి కీలక విజయాలను హైలెట్ చేశారు. 309 మందికి బీటెక్ పట్టాలు, 9 మందికి పిహెచ్‌డిలను ప్రదానం చేశారు. వీరిలో 18 మంది రీసెర్చి స్కాలర్లకు పట్టాలను ఇచ్చారు. ముగ్గురికి బంగారు పతకాలను అందించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఐఐటీ-తిరుపతి డైరెక్టర్ డాక్టర్ కెఎన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో కేంద్రమంత్రి

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం వి ఐ పీ విరామ సమయంలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయక మండపంలో అర్చకులు వేద ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. అంతకుముందు శుక్రవారం తిరుమల చేరుకున్న నితిన్ శనివారం తెల్లవారుజామున శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుచానూరు అమ్మవారిని దర్శించుకున్నారు. రేణిగుంట విమానాశ్రయంలో తిరుగు ప్రయాణమైన నితిన్‌గడ్కరీకి కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి ఎంఎల్ఎ బొజ్జల సుధీర్‌రెడ్డి, టిటిడి బోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, నేషనల్ హైవే పీడీ వెంకటేశ్వర్లు వీడ్కోలు పలికారు. శ్రీకాళహస్తి కళంకారి ప్రశస్తిని వివరిస్తూ చిత్రపటాన్ని అందజేశారు.

'వినాయక' స్థలంలో 'వైన్'షాప్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వినాయకస్వామి గుడికోసం మూడు సెంట్లు స్థలాన్ని కేటాయిస్తే, ఆ స్థలాన్ని వెస్ట్ పోలీసు స్టేషన్‌లో పనిచేసే హెడ్ కానిస్టేబుల్ కబ్జా చేసి బెల్ట్‌షాపు నడుపుతున్నట్లు కమిషనర్ మౌర్యకు ఫిర్యాదు అందింది. రవీంద్రనగర్‌వాసుల వివరాల మేరకు...

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మాస్టర్‌ప్లాన్ రోడ్డు పరిధిలోని రవీంద్రనగర్ మొదటిక్రాస్‌లో సర్వే నంబర్ 173/1లో పి.రాధాక్రిష్ణరాజు, పి.వెంకట సుబ్బయ్యకు 2008లో ఎ.0.1 స్థలాన్ని రిజిష్టర్ చేసి ఇచ్చారు. అందులో మూడు సెంట్లు స్థలాన్ని వినాయకస్వామి గుడికి వెంకట సుబ్బయ్య కేటాయించారు. రవీంద్రనగర్ ల్యాండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులుగా ఉన్న తిరుపతి వెస్ట్ పోలీసు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ వెండ్లిమర్రి మల్లికార్జున్‌తో పాటు, సి.నాగేశ్వరరావు అసోసియేషన్ సభ్యులుగా కొనసాగుతున్నారు. ఈ స్థలాన్ని వారు కబ్జా చేసి రాత్రికి రాత్రే రేకుల షెడ్డు నిర్మించి బెల్టుషాపుకు కేటాయించారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేసి బెల్టుషాపు అద్దెకు ఇచ్చి లబ్ది పొందుతున్నారు. అడ్డుకున్న కాలనీవాసులపై ఓ కార్పొరేటర్ ద్వారా బెదిరింపులకు గురిచేశారు. ఇక్కడ అంకణం ఐదు లక్షల ధర పలుకుతోంది. దాదాపు మూడు సెంట్లు భూమి కోటిన్నర పైమాటే. కబ్జా చేసిన స్థలానికి హెడ్‌కానిస్టేబుల్ మల్లికార్జున భార్య పేరుతో విద్యుత్ మీటర్ తీసుకున్నారు. ఆమె కూడా ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నారు. తిరుపతి అర్బన్ తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయగా, విఆర్ఒ వచ్చి కబ్జాకు గురైన స్థలం వాస్తవమేనని చెప్పారు. కలెక్టర్ వెంకటేశ్వర్లు, అర్బన్ ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు, కమిషనర్ మౌర్య జోక్యం చేసుకుని గుడి కోసం కేటాయించిన స్థలాన్ని గుడికి ఇవ్వాలని కోరుతున్నారు. లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

వెస్ట్ హెడ్‌కానిస్టేబుల్ నిర్వాకం

కబ్జాల మయం మాస్టర్ ప్లాన్ రోడ్లు

తిరుపతి ప్రజలు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని గత ప్రభుత్వం కౌన్సిల్ ఆమోదంతో మాస్టర్ ప్లాన్ రోడ్లు వేశారు. ఇదే అదునుగా భావించి రాజకీయ నేతలు, కబ్జాదారులు బరితెగించి ప్రభుత్వ డీకేటి భూములు, కాలువ పోరంబోకు స్థలాలు , మఠంభూములు కబ్జాలు చేసి కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నారు. కొత్తపల్లి స్మశాన వాటిక సమీపంలో వెంకట్ రెడ్డి కాలనీలోని సర్వే నంబర్ 155/ 1 లో ప్రభుత్వ భూమి 80 సెంట్లు ఉంది. గత 50 ఏళ్లుగా ఈ స్థలాన్ని శ్మశానానికి ప్రజలు వాడుకుంటున్నారు దీన్ని కొంతమంది కబ్జా చేసి షెడ్లు నిర్మించడం అప్పటి తాసిల్దార్ వాటిని కూల్చివేశారు. మార్కెట్ విలువ ప్రకారం ఈ స్థలం సుమారు మూడు కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. అలాగే సర్వే నంబర్ 150/1 ఏలో కూడా సుమారు రెండు ఎకరాలు డికెటి భూమి కబ్జాకు గురైనట్లు ఆ ప్రాంతంలో ఉండే వారు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు సర్వేనెంబర్ 170 లోనూ సుమారు మూడు ఎకరాలు ఉంది. ముఖ్యంగా తిరుపతి నగరంలోని డి బిఆర్ రోడ్డు, హీరో హెూండా షోరూం రోడ్డు, చింతల చేను, 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు, తిమ్మి నాయుడుపాలెం రోడ్డు కబ్జాల మాయంగా మారిపోయింది. ముఖ్యంగా ఇక్కడ ప్రభుత్వ డీకేట్ స్థలాలు రాజకీయ నేతలు చేతుల్లో ఉన్నాయి. వీరు సుమారు రెండు సెంట్లు భూమి ఇక్కడ 10 నుంచి 15 లక్షల రూపాయలు అమ్ముకుంటున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ అవసరాలకి డీకేటి భూములు ప్రభుత్వ ఆధీనంలో ఉండకుండా రాజకీయ నేతల చేతుల్లో ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. నగరంలో వేసిన మాస్టర్ ప్లాన్ రోడ్లు ఎక్కడ చూసినా కబ్జాల భయం కావడంతో నిత్యం గొడవలు పోలీస్ స్టేషన్లో మధ్దిస్తాలు, కోర్టులో కేసులు తప్ప శాంతి భద్రతలు పెను సవాల్‌గా మారింది. ప్రభుత్వ యంత్రాంగం జోక్యం చేసుకుని కబ్జాదారుల ఆగడాలు అరికట్టాల్సిన అవసరం ఉంది.

స్మార్ట్ మీటర్ల నిలువు దోపిడీ ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి - గూడూరు టౌన్

విద్యుత్ ఛార్జీల నిలువు దోపిడీ ఆపాలని, ప్రమాదకర స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు.శనివారం గూడూరు సిపిఎం కార్యాలయంలో వామపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ అధ్యక్షత వహించారు. వక్తలు మాట్లాడుతూ విద్యుత్ ట్రూ అప్ చార్జీలతో ప్రజలు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను తీసుకొచ్చి మరింత భారం మోపే ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ కుట్రను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్లకు లాభం చేకూర్చే చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈనెల 11న విద్యుత్

గూడూరులో వామపక్షాల రౌండ్‌టేబుల్

కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు వెంకట రామిరెడ్డి , పుట్టా శంకరయ్య , పామంజి మణి, అడపాల ప్రసాద్ , గుర్రం రమణయ్య, దారా కోటేశ్వర రావు, ఎంబేటి చంద్రయ్య , బి.చంద్రయ్య , సి.హెచ్ ప్రభాకర్ , శశి కుమార్, రమేష్, బాలాజీ పాల్గొన్నారు.

'తరిగొండ వెంగమాంబ'కు పుష్పాంజలి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

మాతశ్రీ తరిగొండ వెంగమాంబ 208వ వర్ధంతిని పురస్కరించుకుని తిరుపతిలోని ఎం.ఆర్.పల్లి సర్కిల్ వద్ద గల వెంగమాంబ విగ్రహానికి శనివారం టిటిడి శ్వేతా విభాగం అధికారులు ఘనంగా పుష్పాంజలి ఘటించారు. అనంతరం, అన్నమాచార్య కళామందిరంలో బి. మంజుల, టి. తేజోవతి బందం, అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుల బందం శ్రీ వెంగమాంబ కీర్తనలతో సంగీత కచేరి నిర్వహించారు. అటు తర్వాత శ్రీనివాస కళ్యాణంపై కె. చంద్రశేఖర్ బందం హరికథను గానం చేశారు. సాయంత్రం 5.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించారు

పి 4 'దత్తత' దడ

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రకటించిన పి4 (పేదల దత్తతు) కార్యక్రమం జిల్లాలోని అధికారులు, ఉద్యోగుల్లో దడ పుట్టిస్తోంది. దనవంతుడు పేదలను ఆదుకోవడం కలే. ఉన్నవాడు లేనివాడికి సహకరించడం కాగితాలకే పరిమితం. అలాంటి పథకాలు అమలు కత్తి మీద సామే. ప్రభుత్వం ప్రతిష్టాత్మకం అంటూ అధికారులపై నేపం నెట్టడం శోచనీయం. జిల్లా వ్యాప్తంగా పేదలను గుర్తించడం సరే.. వారిని ఆదుకోవడం, జీవితాంతం పోషించడమే పెద్ద సమస్య. అర్హులను గుర్తించారు. అభయహస్తం ఇచ్చేవారే కరువయ్యారు. దీనిపై అధికార యంత్రాంగం ధనవంతులను బతిమాలిన లాభం లేకపోవడం, దత్తతు బాధ్యత ఉద్యోగులపై వేయడం గమనార్హం.

పబ్లిక్, ప్రయివేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్ (పి4). దనవంతులు, పేదవారిని ఆదుకోవడం (స్వచ్ఛందంగా దత్తతు తీసుకోవడం). ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి తిరుపతి జిల్లా సొంత జిల్లా కావడంతో జిల్లా అధికారులకు బంగారు కుటుంబాల దత్తతు వ్యవహారం కునుకుపట్టడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే లక్ష బంగారు కుటుంబాలను అధికారులు గుర్తించారు. జిల్లాలోని కార్పొరేటర్లు, కాంట్రాక్టర్లు, కోటీశ్వర్లకు ఈ పథకం గురించి వివరించి, వారికి అవగాహన కల్పించి, నిరుపేద కుటుంబాలను దత్తతు తీసుకునేలా చేయాల్సిన బాధ్యత అధికారులకు అప్పగించారు. చేసిన శ్రమని గుర్తించి, దానికి తగ్గ సొమ్ము ఇవ్వడానికి మనుసు అంగీకరించని వారు తమ సంపాదనలో కొంత ఉచితంగా ఇస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.

ప్రజాస్వామ్య రాజ్యంలో ప్రజలే ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు కొలువై ఉన్నారు. ప్రపంచ మేధావి, స్ఫూర్తిదాత డాక్టరు బిఆర్ అంబేద్కర్ అందించిన భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకే ఆదర్శనీయం. దాన్ని సక్రమంగా అమలు చేస్తే సమ సమాజం ఎప్పుడో ఏర్పడేది. కుల, మత రక్కసులు రాజ్యమేలుతున్న నేటి సమజాంలో కుల, మతాలకు అతీతంగా ధనవంతులు, పేదవారిని దత్తతు తీసుకోవడం సాధ్యమేనా..?, కార్మికులు దశాబ్దాల తరబడి పోరాడి సాధించిన 8 గంటల పనిదినాలను రద్దు చేసి, 12 గంటలు పని చేయాలని ఆదేశిస్తూ, పేదల శ్రమను దోచుకునేందుకు ఉవ్విళ్లూరుతున్న నేటి ఆంధ్ర పాలకులు, నిజంగా పేదవారిని ఆదుకోవాలని భావించి, ఈ పథకాన్ని నిక్కచ్చిగా అమలయ్యేలా చిత్తశుద్ధితో పని చేసి, విజయం సాధిస్తారనడం అతిశయోక్తి అవుతోంది. సుదీర్ఘ రాజకీయ, పాలన అనుభవం కల్గి ఆర్థిక విభాగంలో నిష్ణాతులైన వ్యక్తే ఇలాంటి ఆలోచనలు చేయడం సామన్యుని సైతం ఆశ్చర్యపరుస్తుందనడంలో సందేహం లేదు.

ఉమ్మడి చిత్తూరుజిల్లా పర్యటన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు కుప్పంలో 250 కుటుంబాలను దత్తతు తీసుకుంటున్నట్లు జూలై 25న ప్రకటించారు. ఆ కుటుంబాలను అన్ని రకాల అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని వెల్లడించారు. ఆగస్టు15 నుంచి పి4 పేజ్-1 ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లా కలెక్టరు వెంకటేశ్వర్లు కలెక్టరేట్‌కు అనుకుని ఉన్న గిరిజన కుటుంబాల్లో ఏడుగుర్ని దత్తతు తీసుకుంటున్నట్లు వెనువెంటనే ప్రకటించారు. ఇక అప్పటి నుంచి జిల్లా అదికారుల వేట ప్రారంభమైంది. పారిశ్రామికవేత్తలు, కోటేశ్వర్లు, కార్పొరేట్ శక్తులకు దీని గురించి ఎంత వివరించిన లాభం లేకుండా పోయింది. దీంతో విధిలేని పరిస్థితుల్లో ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ వంతు బాధ్యతగా బంగారు కుటుంబాల బాధ్యత తీసుకోవాలని జిల్లా అధికారులు అనాధికారికంగా ఆదేశించారు. ఉపాద్యాయులు ఉమ్మడిగా దీన్ని తిరస్కరించారు. తిరుపతి కార్పొరేషన్ అధికారులకు దీనిపై ప్రతి రోజూ దిశ నిర్దేశం జరుగుతూనే ఉంది. నెలో, ఏడాదో అయితే సరే... ఎలాగోలా నెట్టుకొస్తాం.. జీవితాంతం అంటే తమ జీవితాలు బుగ్గవుతాయని ఉద్యోగులు ససేమిరా అంటున్నారు. ప్రజాప్రతినిధులు దీన్నిపై పెద్దగా శ్రద్ద చూపకపోవడం గమనార్హం. ఒక్క శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మాత్రం చంద్రబాబు విజన్‌లో భాగంగా తీసుకొచ్చిన ప్రతిష్టాత్మకమైన బంగారు కుటుంబాల పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. నిజయోకవర్గంలో 11,868 నిరుపేద కుటుంబాలను గుర్తించారు. 38 పరిశ్రమల నుంచి 796 మంది మార్గదర్శకులు ద్వారా 2367 కుటుంబాలను దత్తతు తీసుకున్నట్లు మీడియా పూర్వకంగా ప్రకటించారు. ఇందులో వాస్తవం ఎంత అన్నది పక్కన పెడితే...మిగిత ఎంఎల్‌ఏలు, ఎంపిలు, ఎంఎల్‌సిలు, మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లు, సర్పంచులు, ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, కనీసం దీన్ని పరిగణలోకి తీసుకున్న పాపానపోలేదు.

సుదీర్ఘ అనుభవం ఉన్న సిఎం చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం. ఆయన సొంత జిల్లాలో ఏ మేరకు అమలవుతుంది. అదికారులు ఎంత వరకు విజయం సాధిస్తారో... వేచి చూద్దాం..!

కార్పొరేషన్ కార్యాలయంలో పి4పై సమీక్ష

అనధికార లేఔట్లను క్రమబద్ధీకరించుకోండి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నగరంలో అనధికారిక లే అవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఎన్.మౌర్య శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ.ఎం.ఎస్.నెం.134, ద్వారా అనధికార లే-అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం-2020ని పొడిగించి సవరణ ఉత్తర్వులు జారీచేశారని తెలిపారు. ఈ పథకం క్రింద రాష్ట్రంలో 30-06-2025 వరకు వేసిన అనధికార లే-అవుట్లు, ప్లాట్లను నిర్ణీత అపరాధ రుసుము తో పాటు14శాతం ఓపెన్ స్పేస్ చెల్లించి క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించామని తెలిపారు. ఇతర వివరాలకు "తిరుపతి నగర పాలక సంస్థ" కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను సంప్రదించాలని కమిషనర్ తెలిపారు.

విద్యార్థులకు ఉచితంగా గుర్తింపు కార్డులు పంపిణీ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

పట్నూలు వీధిలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలోని 90 మంది విద్యార్థులకు గుర్తింపు కార్డులను మండల విశ్రాంత అధికారి రంగయ్య గోపాలక్రిష్ణయ్య ఉచితంగా అందజేశారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఎవరైనా దారి తప్పినచో ఈ గుర్తింపు కార్డులు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ప్రధానోపాధ్యాయులు బి.మునికృష్ణనాయుడు, పట్నూలు వీధి ప్రతినిధులు పవన్ కుమార్, రజని, రూప్ సాగర్, నాగరాజు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు ముబారక్ భాష పాఠశాల ఉపాధ్యాయులు శారదా వేణి, మేరీ, హిమబిందు పాల్గొన్నారు.

మార్గదర్శకులను గుర్తించండి : కమిషనర్

తిరుపతి టౌన్ : నగరంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల ఎంపిక త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. పి4 సర్వేలో బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల ఎంపిక పురోగతిపై శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులు, సెక్టోరల్ ఆఫీసర్ తో సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పి4 సర్వేలో బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఆయా సచివాలయ పరిధిలో సెక్రెటరీ లు పూర్తి స్థాయిలో ఇన్వాల్వ్ అయ్యి పి4 సర్వే పూర్తి చేయాలని అన్నారు. బంగారు కుటుంబాల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించాలని, ఏవైనా పొరపాట్లు జరిగితే సంబంధిత అధికారులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, మేనేజర్ హసీమ్ పాల్గొన్నారు.

శ్రీవారి చెంత 'బ్రాండెడ్ హోటల్స్'

- టిటిడి నిర్ణయించిన ధరకే విక్రయం
- ఆహారపదార్థాల నాణ్యతకు పెద్దపీట

ప్రజాశక్తి - తిరుమల



తిరుమల శ్రీవారి భక్తులకు పరిశుభ్రమైన... నాణ్యమైన ఆహారం అందించాలనే టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి ప్రయోగం సక్సెస్ సాధించింది. దేశంలోనే పేరెన్నికగల ఆడయర్ ఆనంద్ భవన్, దంతురీ గ్రూప్స్ హోటల్స్, సంకల్ప హోటల్స్, ప్రిజం, సుఖ్‌సాగర్ లాంటి నాలుగు నక్షత్రాల హోటళ్లు టిటిడి టెండర్లలో పాల్గొన్నాయి. గత నెల 28న టెండర్లు తెరుచుకున్నాయి.

ఐదు పెద్ద హెూటళ్లకు గాను దాదాపు 30 బ్రాండెడ్ హెూటళ్లు టెండరు దాఖలు చేశారు. 5 చిన్న జనతా క్యాంటీన్లకు 70 బ్రాండెడ్ హెూటళ్లు 304 అప్లికేషన్లు జతపరిచారు. ఈ టెండర్లు పరిశీలన ఐదు రోజులపాటు టెండరు దారుల సమక్షంలో జరిగింది. ఒక్కో అప్లికేషన్ గంట నుండి గంటన్నర పాటు పరిశీలించారు. దీంతో టెండరు దారులు ఎక్కువ సమయం నిరీక్షించాల్సివచ్చింది. బ్రాండెడ్ హెూటళ్లకు జరిగిన పరిశీలనలో 29 హెూటళ్లకు గాను ముగ్గురు గైర్హాజరు కాగా 26మంది అప్లికేషన్ లలో 5 మంది మాత్రమే సరైన పత్రాలను సమర్పించారు. టిటిడి ప్రతిపాదించిన మేరకు అప్లికేషన్ వేయడంతో ఐదుగురు టెండరు దారుల సమక్షంలో సీ.ఆర్.ఓ కార్యాలయం కింద ఉన్న సామాన్య భక్తులతో డిప్ లో వేసిన నెంబర్లు తీశారు. అదే విధానం జనతా క్యాంటీన్ లకు కొనసాగింది. ఐదు జనతా క్యాంటీన్ లకూ భారీగా పోటీపడ్డారు. ఒక్కో క్యాంటీన్‌కు సరాసరి 60 అప్లికేషన్ లు నమోదయ్యాయి. ఈ అప్లికేషన్ ల పరిశీలన కూడా గంటల తరబడి జరిగింది. ఈ విధానం మొత్తం ఎస్.వి.బి.సి కెమెరా ద్వారా రికార్డింగ్ చేయించారు. ఇప్పటి వరకు ఇంత క్షుణ్ణంగా టిటిడి టెండర్లు పరిశీలన చేయలేదని, మొట్ట మొదటి సారి ప్రతిష్టాత్మకంగా చేయడం టిటిడి సక్సెస్ సాధించిందని పలువురు అభిప్రాయపడ్డారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే...

భక్తులకు టిటిడి నిర్ణయం చేసిన ధరలకే విక్రయాలు చేయాలని విధి... విధానాలు రూపొందించారు. ఇందులో బయట బ్రాండెడ్ హోటళ్ల ధరలు ఇక్కడ చెల్లుబాటు కావు. సేవా భావంతో చేసేవిధానం కార్పొరేట్ హెూటళ్లకు ఆలోచన ఉండాలనే టిటిడి కోరుతుంది. నాణ్యమైన ఆహార పదార్థాలు విక్రయాలకు సేవా భావంతో సరసమైన ధరలకు భక్తులకు విక్రయాలు చేయగలరని భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.. బ్రాండెడ్ హెూటళ్లకు సంబంధించి టిటిడి లాంటి సంస్థకు రావడం స్వాగతిస్తున్నట్టు ఒంగోలుకు చెందిన 'శ్రీనివాస్' ప్రజాశక్తి తో అభిప్రాయం వ్యక్తం చేశారు.

పారదర్శకంగా సాగిన టెండర్ల ప్రక్రియ

కష్టపడి పనిచేస్తే ఉన్నత స్థాయికి : ఎస్పీ

అర్ధ సంవత్సర నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టైం ఉన్నప్పుడే కష్టపడి పని చేస్తే.. విధి నిర్వహణలో ఉన్నత స్థాయికి వెళతారని అర్ధ సంవత్సర నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. పద్మావతి మహిళా యూనివర్శిటీలో సావేరా గెస్ట్ హౌస్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ శనివారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా గ్రేవ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులు, హౌస్ బ్రేక్ కేసులు, వైట్ కాలర్ నేరాలు, మర్డర్ ఫర్ గేయిన్ కేసులు, రోడ్డు యాక్సిడెంట్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, కోర్టు మోనటరింగ్, ఎన్‌డిపిఎస్, ఈగల్ క్లబ్స్ ఏర్పాటు, సైబర్ నేరాలపై ఈ సమావేశంలో సమీక్షించారు. పోలీసు అధికారులకు నూతన చట్టాలపై ప్రతి సబ్ డివిజన్‌లో ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌తో అవగాహన కల్పించారు. మెడికో లీగల్ కేసులపై ఎస్‌విఆర్‌ఆర్ రుయా హాస్పిటల్ ఫోరెన్సిక్ మెడిసన్ హెచ్‌ఓడి డాక్టర్ శ్రీనివాస నాయక్ తోపాటు డాక్టర్ రామ్మోహన్ రావుతో పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించారు. దీనికి తోడు రీజనల్ ఫోరెన్సిక్ లేబరేటరీ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్‌తో మర్డర్ కేసు జరిగినప్పుడు కాని, దొంగతనం జరిగినప్పుడు సాక్ష్యాలను ఎలా సేకరించాలనే దానిపై అవగాహన కల్పించారు.

గ్రేవ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ చూపి స్పెషల్ టీంలను ఏర్పాటు చేసి గ్రేవ్ కేసుల సంఖ్య తగ్గించే చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఆగష్టు డెడ్ లైన్ పెట్టుకుని ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఉన్న గ్రేవ్ కేసులు పూర్తి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులు పూర్తిస్థాయిలో విచారించిన తర్వాత, చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతరం విజిబుల్ పోలీసింగ్‌తో హౌస్ బ్రేకింగ్ కేసులు కొంచెం తగ్గాయి అన్నారు. ఇటీవల 75 మంది పాత నేరస్తులను అరెస్ట్ చేసామన్నారు. జైలు నుండి విడుదలైన పాత నేరస్థులపై నిఘా పెట్టామన్నారు. ప్రజలను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్ళు, వైట్ కాలర్ నేరస్థులు సిద్ధంగా ఉన్నారని అలాంటి వారి పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. మర్డర్ ఫర్ గేయిన్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డెకాయిట్ కేసులు, దారిదోపిడీ పాత కేసులు పెండింగ్‌లో ఉన్న పోలీస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులను వేంటనే ఛేదించాలని నిర్లక్ష్యం చేయవద్దన్నారు. రోడ్డు యాక్సిడెంట్ కేసు నివారించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాన్నారు. యాక్సిడెంట్ స్పాట్స్ గుర్తించి అక్కడ స్పీడ్ బేకర్స్, బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పైన ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించడం వల్ల మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. కోర్ట్ మోనిటరింగ్ సిస్టం ఏర్పాటు చేయడం ద్వారా వివిధ కేసులలో నేరస్తులకు శిక్షలు పడుతున్నాయన్నారు. ఈగల్ క్లబ్ లను ఎర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా గంజాయి, మాధక ద్రవ్యాలపై కాలేజీలు, స్కూల్స్‌లో అవగాహన కల్పిస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసెక్యూటర్స్ సంధ్య, కేదారినాథ్, జయ శేఖర్, ప్రేమ సాగర్, నిర్మల, కుమారి. శిరీష, అదనపు ఎస్పీలు ఐ రామకృష్ణ, కె. రవి మనోహరాచారి, సబ్ డివిజన్లోని డిఎస్పీలు పాల్గొన్నారు.

పెన్షన్ పంపిణీ చేసిన మట్టం శ్రావణి రెడ్డి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చంద్రబాబు తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. శనివారం గూడూరు మండల పరిధిలోని చెన్నూరులో సామాజిక పెన్షను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మట్టం శ్రావణి రెడ్డి మాట్లాడుతూ పెన్షన్లు పెంచిన ఘనత చంద్రబాబుకి దక్కుతుందన్నారు. నూతనంగా మంజూరైన 28 వితంతువు పెన్షన్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు నీటి సంఘం యూరామప్ప హేమ కుమార్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అల్లం కృష్ణయ్య, అంకమ్మ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్య దీక్షాపరుడు ఇలియాజ్ అహ్మద్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చిల్లకూరు మండల ఇంజనీరింగ్ అధికారి షేక్ ఇలియాజ్ అహ్మద్ ఉద్యోగ విరమణ కార్యక్రమం శనివారం రాత్రి సిజర్ రెడ్డి కళ్యాణమండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ ఇలియాస్ అహ్మద్ ప్రభుత్వ కార్యదక్షుడిగా, చిల్లకూరు మండలంలోని మంచి పేరు తెచ్చుకొని రాష్ట్ర స్థాయిలో అవార్డు పొందారని కొనియాడారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ రాష్ట్ర జేసీస్ చైర్మన్ మురళీకృష్ణ నాయుడు మాట్లాడుతూ ఇలియాస్ అహ్మద్, రియాజ్ అహ్మద్ సోదరులు డిపార్ట్మెంట్‌లో మంచి పేరు తెచ్చుకొని, అందరితో సఖ్యతగా ఉంటూ రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణయ్య, నెల్లూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్బారావు, రాష్ట్ర ఇంజనీర్ సంఘ నాయకులు రవీంద్ర, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రెటరీగా జగదీష్

ప్రజాశక్తి -కోట : గూడూరు నియోజకవర్గం, కోటమండలం, వెంకన్నపాలెం గ్రామానికి చెందిన కనుపూరు జగదీష్‌ను ఎన్నికల ముందు బీసీ సెల్ కమిటీలు రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ నాటి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఎన్నికల తర్వాత అనుబంధ భాగాల్లో మార్పులు, చేర్పులు ఉండడంతో రెండోసారి కూడా వైసిపి ప్రభుత్వం కనుపూరు జగదీష్‌ను అదే పదవిలో కొనసాగిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జగదీష్ మీడియాతో మాట్లాడుతూ నాపై నమ్మకంతో మరోసారి రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రెటరీ పదవి ఇచ్చినందుకు, తన పేరు సిఫారసు చేసిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాభివృద్ధికి సహకరిస్తాం : పిళ్ళారి ఫౌండేషన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి సహకారం అందిస్తామని పిళ్లారి ఫౌండేషన్ అధినేత అమరావతి తెలిపారు. పిళ్లారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఎగువవీధి ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ షేక్, సభ్యులు సుబ్రహ్మణ్యం, పిల్లారి ఫౌండేషన్ ప్రతినిధి హైమవతి, ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు అనురాధ, వర్మ, యశోద, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు తరలిరండి

ప్రజాశక్తి-కోట : మాల ఉద్యోగుల సంఘం, మాల జేఏసీ నాయకులు, దళిత సంఘాలు, బహుజన పార్టీల ఆధ్వర్యంలో ఎస్సీలకు 20 శాతం రిజర్వేషన్ పెంచాలని, క్రిమిలేయర్ రద్దు చేయాలని, బీసీలకు, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని, ప్రైవేట్ రంగాల్లో కూడా రిజర్వేషన్ అమలు చేయాలని, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాజ్యాంగ పరిరక్షణ యాత్ర శనివారం కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రారంభమవుతుంది. ఈ పాదయాత్రకి ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి బహుజన వాదులు తరలిరావాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మీజూరు మాధవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల బాల్, పసనాక హేమంత్, కర్లపూడి వెంకటరమణయ్య, దాసరి అశోక్ కాంబ్లె, దార్ల వేదుకొండలు, కుదురు కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను ఇంటింటికీ తీసుకెళ్ళి, ప్రజలను చైతన్యపరచాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రియాశీలక కార్యదర్శి రాకేష్, కిరణ్ ఆధ్వర్యంలో నగరి మండల పరిధిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సాధ్యంకాని హామీలిచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారని రాకేష్ కిరణ్ ఆరోపించారు. ఈకార్యక్రమంలో మండల ఎంపీపీ దివాకర్ రెడ్డి, పార్టీ కన్వీనర్ సారధియం అన్నాదొర్రె, సాయిరవి, మంజునాథ్, గోవింద్ స్వామి, వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా తిరుమలరెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - రామచంద్రపురం: టీడీపీ రామచంద్రపురం మండల అధ్యక్షులు మేకల తిరుమల రెడ్డి, మాధవి రెడ్డిల జన్మదిన, పెళ్లిరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం రాయలచెరువుపేటలో సింగల్ విండో ప్రెసిడెంట్ చేకూరి జనార్దన్ చౌదరి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. అనంతరం శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, చేకూరి వెంకటేశ్వర ప్రసాద్, కొట్టే దనంజయ రెడ్డి, జిండి విజయకుమార్ రెడ్డి, కొత్తపల్లి సుబ్రహ్మణ్యం నాయుడు, కొమ్మిని ధనంజయ, కొడవలికంటి జగదీష్, కాలేపల్లి ప్రభాకర్, బాబాయ్య, రామమూర్తి, నరసింహా రెడ్డి, రమణారెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు గిరిజనుల వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను యానాదుల గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తలపల చెంచు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో కలిసి సమస్యలను విన్నవించారు. ఇటీవల అన్నమయ్య జిల్లాలో లారీ ప్రమాదంలో మృతిచెందిన గిరిజన కుటుంబాలకు మూడు లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ తిరుపతి రుయాలో మృతిచెందిన పొన్నూరు వెంకటేష్ (ఏర్పేడు ఎస్సీ కాలనీ) కుటుంబానికి మూడు లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. తిరుపతి జిల్లా బాలాయపల్లె మండలం మన్నూరు ఎస్సీ కాలనీలో 70 గిరిజన కుటుంబాలు ఉన్నాయని, కులాలు లేక తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అత్తూరు చెంగలాయులు, మాజీ మెంబర్ మోపూరు ఆదియ్య, జిల్లా అధ్యక్షులు ఆత్మకూరు ఎగిలేటి రేవతి, తిరుపతి ప్రధాన కార్యదర్శి రాములమ్మ, ఉపాధ్యక్షురాలు పసలూరు కల్పన పాల్గొన్నారు.

ఔషధ మొక్కల పెంపకం ఆవశ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ ఔషధ మొక్కల పెంపకం ఆవశ్యకమనీ ఇంచార్జ్ వీసి ఆచార్య అప్పారావు పేర్కొన్నారు. యస్వీయులో బాటనీ విభాగం, శ్రీ రాధాకృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఔషధ మొక్కల పెంపకం.. సవాళ్లు అనే అంశంపై 2 రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదిక్ ఔషధాలు మన జీవనంలో భాగం కావాలన్నారు. యునాని, ఆయుర్వేదిక్, సిద్ధ, మొదలగు పద్ధతులను అవలంబించాలని, అందునిమిత్తం ఔషధ మొక్కలు పెంచాలని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఆయుర్వేద మందులు వాడుతున్నానని, ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు. ఎస్వీయూలో ఔషధ మొక్కల పెంపకం కోసం స్థలాన్ని కేటాయిస్తామన్నారు. సీఈవో మెడిసిన్ ప్లాంట్స్ ఆంధ్రప్రదేశ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ డయాబెటిస్ ఆయుర్వేదంతో తగ్గుతుందన్నారు.

పింఛన్లు పెంచిన ఘనత చంద్రబాబుదే:ఎమ్మెల్యే విజయశ్రీ

అర్హులందరికీ పింఛన్ : మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - నాయుడుపేట: ఒక్క రోజులో 95.05శాతం లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం పింఛన్లను పంపిణీ చేసి సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిందని సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. నాయుడుపేట, గాంధీ పార్కు వద్ద నూతనంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ మంజూరైన లబ్దిదారులకు పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యంలు పాల్గొన్నారు. మాజీ ఎంపీ సూళ్లూరుపేట నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికి ఇచ్చిన హామీలను చంద్రబాబు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, ఓజిలి, పెళ్లకూరు, నాయుడుపేట మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్.రఫీ, టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, నాయుడుపేట మాజీ సర్పంచ్ గూడూరుప్రభావతమ్మ, పెసల గంగప్రసాద్, నెలవల రాజేష్, అవధానం సుధీర్, కట్ట వెంకటరమణారెడ్డి, పొట్లపూడి రాజేష్, అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కుళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోండి

ప్రజాశక్తి - నాయుడుపేట: పట్టణంలోని అనధికారిక కొళాయి కనెక్షన్లను క్రమబద్ధికరించుకోవాలని నాయుడుపేట మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ కోరారు. కమీషనర్ షేక్ ఫజులుల్లా ఆదేశాల మేరకు శనివారం ఉదయం ఆమె పట్టణంలోని అగ్రహారపేట, ఎల్ ఏ సాగరం హరిజనవాడల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అనధికార కొళాయి కనెక్షన్లు ఉన్న ఇళ్లను గుర్తుంచి, క్రమబద్ధికరించుకునేందుకు దరఖాస్తూ చేసుకోవాలని ఆదేశించారు. లేని పక్షంలో కొళాయి కనెక్షన్ ను తొలగించి, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటి, కొళాయి పన్నులను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ తనిఖీల్లో శ్రావణి, సచివాలయ సిబ్బంది, వర్క్ ఇన్స్పెక్టర్లు, ఫిట్టర్లు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి : సిపిఎం నిరసన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరులో వామపక్షాల ఆధ్వర్యంలో శనివారం అంబేద్కర్ సర్కిల్ వద్ద విద్యుత్ చార్జీలు దోపిడీకి నిరసనగా, ప్రమాదకర స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.వెంకటేష్, సిపిఐ మండల కార్యదర్శి డి.మహేష్‌లు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ప్రజలపై భారం పెంచుతాయని, ముందుగానే డబ్బు చెల్లించాల్సి వస్తుందని ఆరోపించారు. 11న తిరుపతిలో ఎస్పీడీసీఎల్ సిఎండి కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నాయకులు రమణా, వెంకట, ముని కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

'గూడూరు-విజయవాడ' మధ్య పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : విజయవాడ –గూడూరు సెక్షన్లో పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఆగస్ట్ నెలలో ఈ రైళ్లను రద్దు చేశారు. మరికొన్నింటిని దారి మళ్లించారు. తిరుపతికి వెళ్లే పలు రైళ్లు రద్దయ్యాయి. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని దక్షిణ మధ్య రైల్వే కోరింది. విజయవాడ – గూడూరు సెక్షన్ మూడో లైన్లో నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. అలాగే మరికొన్నింటిని దారి మళ్లించింది. మరికొన్ని రైలు సర్వీసులను పాక్షికంగా రద్దు చేశారు. ఈ విషయాన్ని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలియజేశారు. విజయవాడ –గూడురు సెక్షన్లో ఇంటరలాకింగ్ పనుల కారణంగా తిరుపతికి వెళ్లే పలు రైళు ఆగస్ట్ నెలలో రద్దయ్యాయి. వాటి వివరాలు..–తిరుపతి – లింగంపల్లి – తిరుపతి రైలును (12733/12734) ఆగస్టు 17వ తేదీ నుంచి రద్దు చేశారు. – రేణిగుంట – కాకినాడ టౌన్ – రేణిగుంట రైలు (17249/17250) ఆగస్ట్ 11వ తేదీ నుంచి ఆగస్ట్ 20వ తేదీ వరకూ రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు.– తిరుపతి – ఆదిలాబాద్– తిరుపతి రైలు (17405/17406) ఆగస్టు 13 తేదీ నుంచి 20 వరకూ వారం రోజుల పాటు రద్దు చేశారు. – నర్సాపురం – ధర్మవరం – నర్సాపురం ఎక్స్ప్రెస్ రైలు (172476/17248) ఆగస్ట్ 11 నుంచి ఆగస్ట్ 19వ తేదీ వరకూ రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. –వీటితో పాటుగా విశాఖపట్నం తిరుపతి ఎక్స్ప్రెస్ 2 (22707) ఆగస్టు14, 16,18 అలాగే తిరుపతి – విశాఖపట్నం ఎక్స్ప్రెస్ రైలు (22708) ఆగస్ట్ 13, 15, 17వ తేదీలలో రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. తిరుపతి – నర్సాపూర్ రైలును (07131) ఆగస్ట్ 17వ తేదీ, నర్సాపూర్ – తిరుపతి రైలు (07132) ఆగస్ట్ 18వ తేదీ రద్దు చేశారు. అలాగే చర్లపల్లి –తిరుపతి రైలు (07251) ఆగస్ట్ 13వ తేదీ..తిరుపతి – చర్లపల్లి రైలు (07252) ఆగస్ట్ 14వ తేదీ రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటనలో వెల్లడించింది.ఈ వివరాలను దష్టిలో పెట్టుకుని రైలు ప్రయాణికులు తమ ప్రయాణాలను షెడ్యూల్ చేసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే సూచించింది.

నేడు సిపిఐ తిరుపతి జిల్లా ద్వితీయ మహాసభలు

■ డాక్టర్ కే.నారాయణ రాక ■ సూళ్లూరుపేటలో ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - తిరుపతి సిటి: భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తిరుపతి జిల్లా రెండవ మహాసభలు ఆదివారం నుండి రెండు రోజులపాటు సూళ్లూరుపేటలో జరగనున్నాయి. ఆదివారం మధ్యాహ్నం జీ ఎన్‌టి రోడ్డు మహాదేవ నగర్ సిపిఐ కార్యాలయం నుండి మహా ప్రదర్శన నిర్వహించనున్నారు. సాయంత్రం సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద బహిరంగ సభ జరుగుతుంది. మహాసభలకు ముఖ్యఅతిథిగా సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి హరినాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు, జయలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి తదితరులు హాజరు అవుతున్నారు. రెండవ రోజు సోమవారం ఉదయం ప్రతినిధుల సభ జరగనుంది. జిల్లా వ్యాప్తంగా 320 మంది ప్రతినిధులు హాజరు అవుతున్నారు. మహాసభల విజయవంతం కోసం జిల్లా కార్యదర్శి పి మురళి తో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు, ఆహ్వాన సంఘం నాయకులు ఏర్పాట్లను పరవేక్షిస్తున్నారు.

దృఢ సంకల్పానికి మరో పేరు యంబియు

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) విద్యార్థులలో ధృడ సంకల్పాని పట్టుదల, సాంకేతిక విజ్ఞానాభివృద్ధి, మానవ సేవకు మరో పేరు మోహన బాబు విశ్వవిద్యాలయం అని రాజ్యసభ సభ్యులు ప్రఫుల్ పటేల్ అన్నారు. చంద్రగిరి మండలం ఏ.రంగంపేట, మోహన్ బాబు విశ్వవిద్యాలయం 2వ కాన్వకేషన్ డే, శ్రీ విద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాల 14 వ గ్రాడ్యుయేషన్ డేను శనివారం వర్శిటీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిలుగా ప్రఫుల్ పటేల్, ప్రముఖ రచయిత హిందీ అకాడమీ చైర్మన్ ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ మాజీ రాజ్యసభ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీలు ప్రసాద్ హాజరయ్యారు. ప్రఫుల్ పటేల్ మాట్లాడుతూ మోహన్ బాబు విలక్షణమైన సినీ నటుడే కాక ఓ గొప్ప విద్యాసంస్థల అధినేతగా పేరు గడిచారని చెప్పారు. పేద విద్యార్థులకు కూడా చదువుకునే అవకాశం కల్పించడం మోహన బాబు విశ్వవిద్యాలయం ప్రత్యేకతన్నారు. యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయంగా మోహన్ బాబు విశ్వవిద్యాలయం పేరు సంపాదించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. మోహన్ బాబు మాట్లాడుతూ అందరి సహకారంతో పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ వరకు రూపాంతరం చెందిందని తెలిపారు. యంబియు ద్వారా ప్రముఖులైన ఇద్దరికీ గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేయటం ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు మాట్లాడుతూ చదువును ఒక మహా యజ్ఞంగా భావించి మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో అన్ని వర్గాల వారికి విద్యను అందిస్తున్నామన్నారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు ఆనందన్ శివమణికి, విశిష్ట రాజకీయ నాయకుడు, ప్రముఖ పాత్రికేయుడు మహారాష్ట్రకు చెందిన లోక్ మత్ పత్రిక అధ్యక్షుడు విజయ్ జవహర్ దార్డాలకు యంబియు గౌరవ డాక్టరేట్లను అందించింది. యంబియు ద్వారా 866 మంది విద్యార్థులు, శ్రీ విద్యానికేతన్ ఇంజనీరింగు కాలేజి నుండి1698 మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పట్టాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒకరోజు శిక్షణ

ప్రజాశక్తి - తొట్టంబేడు : మండల కేంద్రంలోని స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో శనివారం శ్రీకాళహస్తి క్లస్టర్‌లో ఉన్న ఏడు మండలాల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏ.పీ.డి సరిత పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో అమలు చేస్తున్న ఉపాధి హామీ పనులలో జరుగుతున్న లోటుపాట్లను సవరించడానికి కొత్త విధానం అమలు చేయబోతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభుత్వం అందించిన యాప్‌ల ద్వారా ఉపాధి హామీ కూలీల హాజరు శాతాన్ని పొందుపరిచి పై అధికారులకు పంపాలన్నారు. యాప్‌ల వినియోగాన్ని వివరించారు.

అమర విద్యాలయంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలం, కరకంబాడి పంచాయతీ, అమర రాజా విద్యాలయంలో శాంతి – సమైక్యత" అంశంపై చిత్రలేఖన పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీలకు తిరుపతి, చిత్తూరు పరిసరాల నుండి 21 పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. సమాజం శాంతియుతంగా ఎదగాలంటే సమైక్యత, విశ్వశాంతి ఎంతో అవసరమని కారక్రమంలో న్యాయ నిర్ణేతలు అభిప్రాయపడ్డారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

క్రైం న్యూస్

వరుస దొంగతనాలతో ఆందోళన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణం, ఏఎంసీ కళ్యాణమండపం పక్కనున్న సి.ఎస్.బాబు కాంప్లెక్స్‌లోని పిజ్జా క్యాపిటల్ రెస్టారెంట్ వర్కర్స్ గదిలోకి శనివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రెండు మొబైల్ ఫోన్లు, రూ.20,000 నగదు దోచుకెళ్లారు. రెండు రోజుల క్రితం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో షాపుల పై రేకులు తొలగించి రెండు షాపుల్లోకి చొరబడి రూ.31,000 నగదు దోచుకెళ్లారు. ఈ వరుస చోరీలతో షాపుల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు నిఘా పెంచాలని, దొంగలను త్వరగా పట్టుకోవాలని వారు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదం.. వ్యక్తికి గాయాలు

గాయలపాలైన సెల్వరాజ్

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర ప్రవాహన దారుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు చిన్నపాండరు, నక్కల మిట్ట సమీపంలో అతివేగంగా వెళుతున్న ద్విచక్ర వాహనదారుడు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించిపోయి కిందపడడంతో తలకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు యువకుడిని మెరుగైన వైద్యం కోసం సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడిని చిన్నపాండూరుకు చెందిన సెల్వరాజ్‌గా గుర్తించి గుర్తించారు. రోడ్లు పూర్తిగా పాడవడం, పరిశ్రమల్లో విధులకు త్వరగా వెళ్లాలని ఉద్దేశంతో అతివేగంగా వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని స్థానికులు వాపోయారు.

ఎస్వీ జూ పార్క్‌లో పులి మృతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో ఓ ఆడ పులి అనారోగ్య కారణాలతో మృతి చెందినట్లు జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. అధికారుల వివరాల మేరకు ఇటీవల ఆత్మకూరు ప్రాజెక్టు టైగర్ డివిజన్ నుండి ఓ ఆడ పులిని గత నెల ఆరో తేదీన తీసుకువచ్చి ఎస్వీ వెటర్నరీ విశ్వవిద్యాలయం వైద్య బృందంచే సర్జరీ చేయించారు. సర్జరీ అనంతరం పులికి కుట్లు మానడానికి మృదువైన ఆహారం, మందులు ఇచ్చినట్లు తెలిపారు. గత నెల 30వ తేదీ నుండి ఆహారం తీసుకోకుండా కేవలం నీటిపై పులి ఆధారపడిందన్నారు. ఆరోగ్యం క్షీణించడంతో శుక్రవారం ఆర్ధరాత్రి మృతి చెందినట్లు తెలిపారు. తదుపరి ఎస్వీ జంతుప్రదర్శనశాలలోనే మరణించిన ఖననం చేసినట్లు తెలిపారు.

పింగళి వెంకయ్యకు నివాళి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని బాబుగ్రహారం పురపాలక ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ మాస్టర్లు ఎస్కే. అజారుద్దీన్, వెంకటాద్రి, యోగానందం, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పింగళి వెంకయ్య జయంతి వేడుకలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పింగళి వెంకయ్య స్వాతంత్ర సమర యోధుడని, జాతీయ జెండా రూపకర్త అని పలు విషయాలు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రదీప్ కుమార్ ఆనంద్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు మనస్తత్వం శాస్త్ర విభాగంలో పరిశోధన చేసినందుకు గాను అమర రాజా సంస్థలో సైకాలజిస్ట్ గా పనిచేస్తున్న బి.ప్రదీప్ కుమార్ ఆనంద్‌కు డాక్టరేట్ డిగ్రీ ఇస్తున్నట్లుగా ఎస్వీయూ పరీక్షల నియంత్రణాధికారి రాజమాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదీప్ సైకాలజీ విభాగ విశ్రాంత ఆచార్యులు వి. శ్రీకాంత్ రెడ్డి పర్యవేక్షణలో " సైకో సోషియల్ ఫ్యాక్టర్స్ ఇన్ఫ్లూయన్సింగ్ ఓటింగ్ బిహేవియర్ " అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

IN THE COURT OF THE XII ADDL.DIST JUDGE, SRIKALAHASTI
A.S.NO. 1/2025
Between
M.S. Ramakrishna Reddy ... Appellant
And
T.Krishnavenamma (Died) by her L.Rs. ... Respondents
Notice to theRespondents No. 3 to 5
To
(R3) T. Leelavathy, D/o. T. Balarama Reddy
(R4) T. Padmavathy, D/o. T. Balarama Reddy Both are residing at varathur Village, B.N. Kandriga Mandal, Tirupati District
(R5) T. Subhashini, W/o. Menaswamy Reddy residing at Kota Kommala Street, Tirupati Town and District.
Where as the above named appellant has filed the above appeal against you before the said Hon'ble Court. The said case is posted on 05.08.2025 for your appearance. The same is intimated through paper publicastion by order of the Hon'ble Court. Hence all of you be present either in person or through advocate on 05.08.2025 at about 10.30am before the said Hon'ble court or otherwise the case will be decided as exparte in you absence.
A. VASUDEVA REDDY
P. BHASKAR
Advocates for Appellant
Srikalahasti

మహారాజశ్రీ వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 222/2024
రంగినేని సౌమ్య ...వాది
VS
గుత్తికొండ లలిత్‌కుమార్ ...ప్రతివాది
To.
గుత్తికొండ లలిత్‌కుమార్, తండ్రి రామానాయుడు జి.కె.పల్లి గ్రామం, వెంకటగిరి మం, నెల్లూరుజిల్లా ప్రస్తుతం తిరుపతిజిల్లా
దావా నోటీసు
మీ వద్ద బాకీ రాబట్టుకొనుటకుగాను పైన తెలిపిన వాది పై కోర్టులో రూ.3,41,315లను రాబట్టుకొనుటకు గాను దావా వేసియున్నారు. మీ నోటీసు నిమిత్తం పైన తెలిపిన పిటిషన్‌ను 05.08.2025 తేదీ నాటికి వాయిదా వేసియున్నారు. కావున మీరు 05.08.2025న పై కోర్టులో ఉదయం 10.30గం॥లకు మీరు గాని మీ తరుపున వకీలు గానీ హాజరై ఆక్షేపణలున్న తెలుపవలసినది లేని యెడల మీ పరోక్షంగా తీర్మానించబడును
ఇట్లు
తాయి విజయ్‌కుమార్
వాది తరుపు న్యాయవాది
వెంకటగిరి–9030837221

మహారాజశ్రీ వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No. 580/2024
O.S. 222/2024
రంగినేని సౌమ్య ...Petitioner/Plaintiff
VS
గుత్తికొండ లలిత్‌కుమార్
Respondent/Defendant
To.
గుత్తికొండ లలిత్‌కుమార్, తండ్రి రామానాయుడు, జి.కె.పల్లి గ్రామం, వెంకటగిరి మం, నెల్లూరుజిల్లా ప్రస్తుతం తిరుపతిజిల్లా
నోటీసు
మీ వద్ద బాకీ రాబట్టుకొనుటకుగాను పైన తెలిపిన వాది, పై కోర్టులో రూ.3,41,315లను దావా వేసియున్నారు. మరియు క్రింద తెలిపిన షెడ్యూలు దాఖలా ఆస్తిని తీర్పుకు ముందు జప్తు చేయమని అటాచ్‌మెంట్ బిఫోర్ జడ్జిమెంట్ పై I.A.No. 580/2024 ద్వారా కోరియున్నారు. కావున మీ నోటీసు నిమిత్తం పైన తెలిపిన పిటిషన్‌ను 05.08.2025 తేదీ నాటికి వాయిదా వేసియున్నారు. కావున మీరు 05.08.2025న పై కోర్టులో ఉదయం 10.30గం॥లకు మీరు గాని మీ తరుపున వకీలు గానీ హాజరై ఆక్షేపణలున్న తెలుపవలసినది లేని యెడల మీ పరోక్షంగా తీర్మానించబడును
షెడ్యూలు
తిరుపతిజిల్లా – వెంకటగిరి, సబ్‌రిజిస్ట్రేషన్ – వెంకటగిరి మండలం, కలవలపూడి గ్రామం, ఖాతా నెం. 367, సర్వే నెం.76/3లో య.0.62ట్లు మెట్ట భూమి.
ఇట్లు
తాయి విజయ్‌కుమార్
వాది తరుపు న్యాయవాది
వెంకటగిరి–9030837221

IN COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL 1ST CLASS MAGISTRATE:: PUTTUR
IA No. 1271/2023
O.S. No. 241/2016.
BETWEEN:
Sirivella Yuvakumar and others ...Plaintiffs
AND:-
Sirivella Chanukya and another ...Defendants
NOTICES TO RESPONDENTS NO: 2 AND 3
R2:- Sirivella Pallavi, D/o Late. Mahadevaiah, Hindu, aged about 28 years, Housewife, Door No.4-8-24, Bommagunta, Near I.S.Mahal Theater, Thirupathi Urban Mandal, Thirupathi town and Post, Tirupati Dist.,
R3:- Muneswari, D/o Muniramalingam, Hindu, aged about 55 years, Cultivation, Yanamalapalem Village, Appalayagunta Post, Vadamalapet Mandal, Tirupati district, A.P.,
Please take summons that, the above case was filed by the plaintiffs as against you for partition in the above court and the same is posted on: 06.08.2025. Hence you are here by directed to attend before the above court at about 10-30 A.M. either by person or through Advocate. Otherwise the above case will be decided an exparty.
Hg. date: 06.08.2025
G. Raja Reddy, B.Com, L.L.B.
P. Kumarvel, B.Com, L.L.B.,
Advocates
Puttur.

IN COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL 1ST CLASS MAGISTRATE:: PUTTUR
IA No. 1272/2023
O.S. No. 241/2016.
BETWEEN:
Sirivella Yuvakumar and others ...Plaintiffs
AND:-
Sirivella Chanukya and another ...Defendants
NOTICES TO RESPONDENTS NO: 2 AND 3
R2:- Sirivella Pallavi, D/o Late. Mahadevaiah, Hindu, aged about 28 years, Housewife, Door No.4-8-24, Bommagunta, Near I.S.Mahal Theater, Thirupathi Urban Mandal, Thirupathi town and Post, Tirupati Dist.,
R3:- Muneswari, D/o Muniramalingam, Hindu, aged about 55 years, Cultivation, Yanamalapalem Village, Appalayagunta Post, Vadamalapet Mandal, Tirupati district, A.P.,
Please take summons that, the above case was filed by the plaintiffs as against you for partition in the above court and the same is posted on: 06.08.2025. Hence you are here by directed to attend before the above court at about 10-30 A.M. either by person or through Advocate. Otherwise the above case will be decided an exparty.
Hg. date: 06.08.2025
G. Raja Reddy, B.Com, L.L.B.
P. Kumarvel, B.Com, L.L.B.,
Advocates
Puttur.

IN COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL 1ST CLASS MAGISTRATE:: PUTTUR
IA No. 561/2024
IA No. 562/2024
O.S. No. 241/2016.
BETWEEN:
Sirivella Yuvakumar and others ...Plaintiffs
AND:-
Sirivella Chanukya and another ...Defendants
NOTICES TO RESPONDENTS NO: 2
R2:- Sirivella Pallavi, D/o Late. Mahadevaiah, Hindu, aged about 28 years, Housewife, Residing at Door No.4-8-24, Bommagunta, Near I.S.Mahal Theater, Thirupathi Urban Mandal, Thirupathi town and Post, Tirupati Dist.,
Please take summons that, the above case was filed by the plaintiffs as against you for partition in the above court and the same is posted on: 06.08.2025. Hence you are here by directed to attend before the above court at about 10-30 A.M. either by person or through Advocate. Otherwise the above case will be decided an exparty.
Hg. date: 06.08.2025
G. Raja Reddy, B.Com, L.L.B.
P. Kumarvel, B.Com, L.L.B.,
Advocates
Puttur.

తల్లిపాలు.. శిశువుకు మేలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధి, కాపు వీధి, అంగన్వాడి కేంద్రంలో శనివారం తల్లిపాల ప్రముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ సంధ్య మాట్లాడుతూ గర్భవతులకు, బాలింతలకు బిడ్డలకు తల్లి పాలు అందించడం తల్లి బిడ్డలకు ఇద్దరికీ ఆరోగ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త లలిత, ఆశ కార్యకర్తలు కోకిల, ప్రమీల, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుచ్చినాయుడు కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ మురళీధర రెడ్డి ఆదేశాల మేరకు ఆరోగ్యాధికారి డిఎన్ వెంకటేశుర్లు శనివారం మండలంలోని పల్లమాల ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో గర్భవతులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను గురించి వివరించారు. ముర్రు పాలతో బిడ్డకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పుట్టిన బిడ్డకు తల్లి ముర్రిపాలు ఒక టీకా లాంటిదని గూడూరు ఐసిడిఎస్ సిడిపిఓ మెహబూబీ పేర్కొన్నారు. శనివారం గూడూరు మండల పరిధిలోని చెన్నూరు సెక్టార్, చెన్నూరు 2వ హరిజనవాడ, అంగనవాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న మెహబూబీ తల్లి పాల విశిష్టతను వివరించారు. అనంతరం గర్భవతులకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శివ జ్యోతి. అంగన్వాడి కార్యకర్తలు మేరీ ప్రసన్న, జ్యోతి, కామాక్షమ్మ, వై.కామాక్షమ్మ, ఆయాలు గర్భవతులు, బాలింతలు, బిడ్డల తల్లులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం స్థానిక బాలాజీ కాలనీ, ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థునులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం ప్రాజెక్ట్ అసోసియేట్ డా. ఇ.కోన ప్రభ మాట్లాడుతూ తల్లిపాలు శిశువు భవిష్యత్ ఆరోగ్యంపై ప్రభావితమైనవని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, మహిళా అధ్యయన కేంద్రం ప్రాజెక్ట్ అసిస్టెంట్ డా.ఇంద్రాణి, విద్యార్థునులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండల వ్యాప్తంగా పలు అంగన్వాడి కేంద్రాలలో మహిళ శిశు సంక్షేమం, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల సమన్వయంతో గర్భిణీలకు, బాలింతలకు బిడ్డకు తల్లిపాల ప్రాధాన్యత గురించి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కందాడు ఐసిడిఎస్‌లో సూపర్వైజర్ అనిత, ప్రగతి సంస్థ పాపానాయుడుపేట క్లస్టర్ కోఆర్డినేటర్ సుభాష్‌లు తల్లి పాలలో పోషకాలు శిశువుకు వరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధా, నిర్మల, బత్తెమ్మ, శంకరమ్మ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తొట్టంబేడు : మండలంలోని చోడవరం పంచాయతీ అంగన్వాడీ కేంద్రంలో శనివారం ప్రపంచ తల్లిపాలు వారోత్సవాల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తొట్టంబేడు మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు సురేంద్ర యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కాసరం పంచాయతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది మహిళలకు తల్లిపాల విశిష్టతను తెలియజేశారు.

సాధారణ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - చిట్టమూరు: శనివారం చిట్టమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు సన్నారెడ్డి విజయలక్ష్మి సమక్షంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలను అధికారులకు వివరించారు. ఎంఎన్ఇఆర్‌జిఎస్ మీద ప్రతి ఒక్కరికి కష్టానికి తగ్గ ఫలితం అందాలని, అందులోని అవకతవక లను సరిచేయాలని కోరారు. సర్పంచులు వారి గ్రామ సమ స్యలను నివేదిక రూపంలో ఎంపీడీవోకు సమర్పించారు. సన్నా రెడ్డి విజయలక్ష్మి మాట్లాడుతూ అధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి సమస్యకు సాధ్యమైనంత వరకు పరిష్కారం చేయడానికి ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చిప్పల వెంకటయ్య, ఉపాధ్యక్షులు డివి రమణయ్య, ఎంపిటిసి రాయపు సుబ్బమ్మ, సర్పంచులు, మండల అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరుకు బదిలీపై వచ్చిన సిఐ కె.ఆర్.శేఖర్ రెడ్డిని సిపిఐ పార్టీ పుత్తూరు మండల నాయకులు శనివారం కలిసి ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసు కోవాలని కోరి, వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు సిఐతో మాట్లాడుతూ కళాశాల పరిసర ప్రాంతాల్లో ఉద యం, సాయంత్రం ప్రత్యేక బీట్ ఏర్పాటు చేయాలని, ఆర్‌డిఎం గేటు వద్ద తరచు ఏర్పడే ట్రాఫిక్ జామ్‌ను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మహేష్, నాయకులు గోపి, మనీ, రమేష్, రవి, భాస్కర్, రమణ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బూస్టర్ డోస్ సకాలంలో అందించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టీకాలతో నివారించగల వ్యాధుల నుంచి పిల్లలను రక్షించడానికి, పాఠశాల ప్రవేశ వయస్సులో పిల్లలకు డిఫ్తీరియా, ధనుర్వాతం, కోరింత దగ్గు, పోలీయోకు వ్యతిరేకంగా బూస్టర్ డోస్‌ను సకాలంలో అందించాలని ఎస్ఆర్ ఆసుపత్రి పీడియాట్రిషియన్ డాక్టర్ కె. రామ్మోహన్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బాల్యంలో అందించే టీకాలు ముందస్తు రక్షణకు పునాది వేసినప్పటికీ, ఆ రోగనిరోధక శక్తి కాల క్రమేణా బలహీన పడుతుంది. అందుకే పిల్లలకు నాలుగు, ఆరు సంవత్సరాల మధ్య, రక్షణను మరింత బలోపేతం చేయాలన్నారు. బూస్టర్‌తో పిల్లల ఎదుగుదల కీలకమైన దశలో పూర్తి రక్షణ కలిగి ఉంటారన్నారు.

బిటెక్ (స్వీడన్) ప్రవేశాలకు ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్ :యస్వీయు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ (స్వీడన్) కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ప్రోగ్రాం చదవడానికి దరఖాస్తు చేసుకోవచ్చని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు తెలిపారు. గతంలో యస్వీయు- స్వీడన్ లోని ' బ్లెకింగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' తో జరిగిన పరస్పర అంగీకార ఒప్పందం ప్రకారం ఎస్వీయూ బిటెక్ 4 సంవత్సరాల ప్రోగ్రాం నిర్వహించ బడు తుందని తెలిపారు. ఈ ప్రోగ్రాం 3 సంవత్సరాలు ఎస్వీ యూలో, ఒక సంవత్సరం స్వీడన్, బెక్లింగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సాగుతుందన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఈ ప్రోగ్రాంలో చేరదలచిన విద్యార్థులు ఈ ఆగస్టు నెల 4 వ తేదీ నుంచి 14 వతేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు www.svudoa. in/doa వెబ్సైట్ సంప్రదించాలని కోరారు.

అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కు పాదం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పట్టణ పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పుత్తూరు సిఐ కె.ఆర్ శేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరితో మాట్లాడుతూ మట్కా, గ్యాంబ్లింగ్ ఎర్రచందనం, ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు తావులేకోకుండా చర్యలు తీసుకొని, వాళ్ల మీద పీడీ యాక్ట్‌కి ప్రపోజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. పట్టణంలో ట్రిఫిక్ సమస్యకు పరిష్కరిస్తామని, నైట్ బీట్ పెంచుతామని తెలిపారు.

రామయ్యకు బంగారు తులసి హారం బహూకరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి శ్రీ కోదండరామ స్వామికి శనివారం బెంగళూరుకు చెందిన దాత బంగారు తులసి హారం బహుకరించారు. రూ.26 లక్షల విలువైన 257 గ్రాముల బంగారు తులసి దళాలపై గాయత్రి బీజాక్షరాలు చెక్కబడిన హారంను దాత ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్నకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద కుమార్ దీక్షితులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ సురేష్, అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేయండి

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంటలోని దారులు గుంతల మయంగా మారాయని, దీనివల్ల ఆటో డ్రైవర్లు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆటో యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో శనివారం పంచాయతీ కార్యాలయం ఎదుట శనివారం నిరసన చేపట్టారు. ఆటోల రిపేర్లకు ఎక్కువ ఖర్చు చేయాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ నగేశంకి వినతిపత్రం అందజేశారు. రోడ్ల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఆటో గౌరవ అధ్యక్షుడు విఆర్ రావణన్, యూనియన్ అధ్యక్షులు నవీన్, నాయకులు సురేష్, సూరి నాగరాజు, వాలాజ నాయుడు, గౌరీ శంకర్, కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రామారావుని బదిలీ చేయాలి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: రామారావుని బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 45వ రోజుకు చేరాయి. ఈసందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ రామారావుని, వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. రామారావుని వెంకటగిరి నుండి బదిలీ చేసేంతవరకు, కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సిఐటియు ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు వెంకటగిరి మండల జాయింట్ సెక్రెటరీ చిరంజీవి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాజయ్య, మున్సిపల్ యూనియన్ నాయకులు పెంచలయ్య, సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, రమణయ్య మాధురి, శుభ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూసీఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూసీఈ 1996-2000 బ్యాచ్ సిల్వర్ జూబ్లీని గ్రాండ్ రీయూనియన్ ఎస్వీయూసీఈ క్యాంపస్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి అనుసంధానమై ఆన్లైన్లో ఈ వేడుకల్లో పలువురు పాల్గొన్నారు. కళాశాల రోజుల్లో తమకు మార్గనిర్దేశం చేసిన అధ్యాపకులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఎస్వీయూసీఈలో అధ్యాపకులుగా, ఒకే బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు ప్రొఫెసర్ దివాకర్‌రెడ్డి, ప్రొఫెసర్ పి. హేమ ఆర్గనైజింగ్ కమిటీకి నేతృత్వం వహించారు. వీరికి నీరజ, సుబ్బారెడ్డి, విభవర్ధన్, విశ్వనాథ్, అమరేష్, నవీన్, మీనా, సతీష్ కుమార్‌లతో కూడిన కోర్ టీం సహకరించింది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో మాతా, శిశు మరణాలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, పల్లమాల ఉన్నత పాఠశాలలో శనివారం ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ మురళీధర్ రెడ్డిల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించానట్లు ఆయన తెలిపారు. మహిళలకు 21, పురుషులకు 25 సంవత్సరాలు నిండిన తరువాత వివాయాలు చేయడం శ్రేయస్కరమన్నారు. శారీరకంగా, మానసికంగా పరిపక్వత రాకముందే వివాహం జరిపించినట్లయితే అనేక ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ గ్లోబల్ కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - క్యాంపస్: అమరా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, డాక్టర్ అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో అంబేద్కర్ గ్లోబల్ న్యాయ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథి ఎస్వీయూ ఇన్చార్జ్ విసి ఆచార్య అప్పారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్స్టిట్యూట్ అధినేత డాక్టర్ తిప్పారెడ్డి రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.డాక్టర్ తిప్పారెడ్డి మాట్లాడుతూ అన్ని దానాల్లో కల్లా రక్తదానం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో అమర్ రాజా హాస్పిటల్ పేథాలజిస్ట్ డాక్టర్ ప్రవీణ్, ఏజీఎం శ్రీధర్, చీప్ ఆపరేషన్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమార్ బెహరా, కళాశాల సెక్రటరీ లక్ష్మీ ప్రశస్త అధిక సంఖ్యలో రక్తదాతలు పాల్గొన్నారు.

3న ప్రస్థానత్రయంలో భాష్యోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొ.జి.యస్.ఆర్ క్రిష్ణమూర్తి, రిజిస్ట్రార్ కె.వెంకట నారాయణరావు, ఉత్కల పీఠం డైరెక్టర్ డా. జ్ఞానరంజన పండా, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ప్రొ.వి.రమేష్ బాబు, ఎ.పి.ఆర్.ఓ డా. కనపాల కుమార్‌లు హాజరయ్యారు. విశ్వవిద్యాలయం వైస్-చాన్సలర్ ప్రొ.జి.యస్.ఆర్ క్రిష్ణమూర్తి పత్రికా విలేకరులనుద్దేశించి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో చేస్తున్న, చేయబోబుతున్న వివిధ అంశాలపైన మీడియా మిత్రులకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీ స్వామినారాయణ సంప్రదాయ అక్షరపురుషోత్తమ మందిర ఆవిష్కరణ (అబుదబిలో నిర్మించిన ప్రకారం నిర్మించిన మందిరం), విశ్వవిద్యాలయ హెరిటేజ్ ప్రాంగణంలో దర్శన రిప్లికా స్థాపన, శ్రీ స్వామినారాయణ సంప్రదాయ సంస్థలతో విశ్వవిద్యాలయం పరస్పర అవగాహనా ఒప్పందం, ప్రత్యేకించి అమెరికా, ఇగ్లండ్, అబుదబి, నేపాల్లో ఉన్నటువంటి సంస్థలతో ఎమ్.ఓ.యు మరియు అక్షరపురుషోత్తమ దర్శనంలో విశేష పరిశోధనలు, భారతీయ దార్శనిక అనుంధాన పరిషత్, స్వామినారాయణ శోధసంస్థానం, అక్షరధామ్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉత్కల పీఠం సంయుక్త ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ప్రస్థానత్రయంలో భాష్యోత్సవం అనే జాతీయ సదస్సు శని, ఆది, సోమ వారాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. భాష్యోత్సవం జాతీయ సదస్సుకు యు.జి.సి వైస్ చైర్మన్, భారతీయ దార్శనిక అనుంధాన పరిషత్ అధ్యక్షులు ప్రొ దీపక్ కుమార్ శ్రీవాస్తవ, భారతీయ దార్శనిక అనుంధాన పరిషత్ మెంబర్ సెక్రటరీ ప్రొ, సచ్చిదానందమిశ్ర ముఖ్యాతిథిలుగా విచ్చేయచున్నారని వెల్లడించారు.